

Registered No : APTEL/25/A0818

ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక



శుక్రవారం 06-11-2026 | పేజీలు :4 | వెల :2 | సంపుటి :02 | సంచిక :139 | www.edhikadhanijam.com | ఎడిటర్ : బాలరాజు గౌడ్

ఇవి ఎలక్షన్లా.. సెలక్షన్లా?



ఎన్నికలపై జగన్ తీవ్ర అసహనం

పోలింగ్ కేంద్రాల్లో దౌర్జన్యాలంటూ ఆరోపణలు

ఎన్నికల ప్రక్రియను కబ్జా చేశారంటూ విమర్శ

వ్యవస్థలను హైజాక్ చేశారని ఆరోపణ

వైసీపీ నామినేషన్లు అడ్డుకున్నారంటూ ఆవేదన

రిగ్గింగ్‌పై అధికారులు మౌనం వహించారని విమర్శ

2 లో

బస్సు కదలాలంటే డోరు మూయాల్సిందే..

కండక్టర్ ప్రవళిక మృతితో కీలక నిర్ణయం

డోర్ల పనితీరుపై తనిఖీలకు ఆదేశాలు

లోపాలుంటే వెంటనే మరమ్మతులు

అన్ని డోర్ల బస్సులకు కొత్త నిబంధన

పల్లె వెలుగు నుంచి లహరి స్లీపర్ వరకు వర్తింపు

అద్దె, ఎలక్ట్రిక్ బస్సులకూ భద్రతా తనిఖీలు



2 లో

న్యూస్ డెస్క్, 05 నవంబర్ (ఇది కద నిజం): తెలంగాణ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారికి, విధులు నిర్వహించే సిబ్బందికి భద్రత కల్పించే దిశగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ)కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ప్రయాణికుల కోసం ప్రత్యేక తలుపులు ఏర్పాటు చేసిన బస్సులు.. అవి పూర్తిగా మూసిన తర్వాతే ముందుకు కదలాలని తేల్చి చెప్పింది. బస్సు ప్రయాణంలో ఉన్నంతసేపు డోర్లు తెరిచి ఉంచకూడదని స్పష్టం చేసింది. ఇటీవల విధి నిర్వహణలో ఉన్న మహిళా కండక్టర్ గుండ్ల ప్రవళిక కదులుతున్న బస్సు నుంచి కిందపడి మృతి చెందిన ఘటన నేపథ్యంలో ఆర్టీసీ యాజమాన్యం ఈ కొత్త ఆదేశాలు జారీ చేసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం మిట్టగూడెం సమీపంలో అక్టోబర్ 25వ తేదీన ఈ విషాద ఘటన చోటుచేసుకుంది.

కంకణం కట్టుకున్నా.. చేసి చూపిస్తా!

రెండేళ్లలో మట్టి రోడ్లు లేకుండా చేస్తా

ఎస్ఎల్బీసీ పనులు వేగవంతం

శ్రీశైలం డెడ్ స్టోరేజ్ నుంచి సాగునీరు

నల్లగొండను సస్యశ్యామలం చేస్తా

బ్రాహ్మణ వెల్లెంలతో లక్ష ఎకరాలకు నీరు

ఏఎంఆర్పీ కాలువలకు రూ.450 కోట్లు

రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం

2 లో

అయ్యప్ప సొసైటీపై కవిత అల్టిమేటం!

అక్రమ భవనాలపై చర్యలకు డిమాండ్

వందలాది అక్రమ నిర్మాణాలంటూ ఆరోపణ

హైకోర్టు ఉత్తర్వుల ఉల్లంఘన

మీడియాకు బెదిరింపులపై ఆగ్రహం

సమగ్ర సర్వేకు కవిత డిమాండ్

కేంద్రం సాయం చేయలేదని ఆరోపణ

సాగునీరు, విద్యుత్ సమస్యలపై నిలదీత



న్యూస్ డెస్క్, 05 నవంబర్ (ఇది కద నిజం): హైదరాబాద్‌లోని అయ్యప్ప సొసైటీ భూములను ముఖ్యమంత్రి, ఆయన కుటుంబ సభ్యులు కామధేనువుగా వాడుకుంటూ అక్రమ సంపాదనకు పాల్పడుతున్నారని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. నగరంలో మౌలిక వసతులు గాలికొదిలేసి కేవలం అక్రమ సంపాదనపైనే సీఎం దృష్టి పెట్టారని మండిపడ్డారు. గురువారం బంజారాహిల్స్ లోని టీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన కవిత.. నెల రోజుల్లో అయ్యప్ప సొసైటీలోని అక్రమ భవనాలపై చర్యలు తీసుకోవాలని, లేదంటే తామే స్వయంగా వెళ్లి అక్రమ భవనాలకు 'రెడ్ మార్క్' వేస్తామని అల్టిమేటం జారీ చేశారు.

భూదాన్ ఉద్యమ స్ఫూర్తితో తెలంగాణ విద్యార్థుల కోసం అయ్యప్ప సొసైటీలో 150 ఎకరాలతో గురుకుల ట్రస్ట్ బోర్డు ఏర్పాటైందని కవిత గుర్తుచేశారు

2 లో

డీఎస్సీ-2026 నోటిఫికేషన్ విడుదల

మొత్తం 2,721 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ

నవంబర్ 11 నుంచి దరఖాస్తులు

2,111 రెగ్యులర్ టీచర్ పోస్టులు

ప్రత్యేక విద్యా ఉపాధ్యాయులకు 350 పోస్టులు

సొసైటీల పరిధిలో 260 పోస్టులు

కంప్యూటర్ ఆధారిత పరీక్ష విధానం

అధికారిక వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు

2 లో

జల సంరక్షణకు ఉత్తమ్ ప్లాన్!

భూగర్భజలాల సంరక్షణపై ప్రత్యేక దృష్టి

భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళిక

జల సంరక్షణకు ప్రత్యేక బడ్జెట్ కేటాయింపు

జిల్లాలవారీగా భూగర్భజలాల స్థితిగతుల పరిశీలన

రాజస్థాన్‌లో జల పునరుద్ధరణ చర్యల అధ్యయనం

మహారాష్ట్ర జల సంరక్షణ విధానాలపై సమీక్ష

విజయవంతమైన విధానాలు తెలంగాణలో అమలుకు చర్యలు

2 లో

యుద్ధమే కొంపముంచింది



2 లో

న్యూస్ డెస్క్, 05 నవంబర్ (ఇది కద నిజం): మధ్యంతర ఎన్నికలలో రిపబ్లికన్ పార్టీ ఓటమిపై అమెరికా వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్ సెన్సేషనల్ కామెంట్స్ చేశారు. ఈ మేరకు ఆయన గురువారం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్విట్టర్ వేదికగా అత్యంత ఆసక్తికరమైన విశ్లేషణ చేశారు.

విదేశీ ఫండింగ్‌తో విష ప్రచారం!



భారత్ వ్యతిరేక శక్తుల నుంచి నిధులు

విదేశీ ఫండింగ్‌పై జితేంద్ర సింగ్ ఆరోపణలు

ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నారంటూ విమర్శలు

డీప్ స్టేట్ కుట్ర ఉందని వ్యాఖ్య

అభిజీత్ దీపేకు అమెరికా దాతల నుంచి నిధులు?

అశుతోష్ రాంకాకు పాక్ నుంచి చెల్లింపులు?

నిధుల మూలాలు వెల్లడించాలని సవాల్

2 లో

తెలంగాణకు నిధుల వరద!



- తెలంగాణకు కేంద్రం భారీ నిధులు
- రూ.3,892 కోట్ల ప్రాజెక్టులకు గ్రీన్‌సిగ్నల్
- ఐదు కీలక పనులకు ఆమోదం
- హైదరాబాద్‌కు రూ.1,992 కోట్లు
- వరంగల్ వరదలకు చెక్ పెట్టేలా..
- కోట కందకం పునరుద్ధరణకు నిధులు
- హనుమకొండలో ఆధునిక బస్ డిపో
- అలంపూర్ ఆలయ అభివృద్ధికి రూ.57.50 కోట్లు
- గతంలోనే రూ.5,674 కోట్ల ప్రాజెక్టులకు ఓకే

న్యూస్ డెస్క్, 05 నవంబర్ (ఇది కద నిజం): తెలంగాణలో పట్టణ మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం భారీ ప్రోత్సాహాన్ని అందించింది. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద రాష్ట్రంలో రూ.3,892 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఐదు కీలక అభివృద్ధి ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. ఈనెల 3న ఢిల్లీలో జరిగిన నాలుగో నేషనల్ ఎపెక్స్ కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ముఖ్యంగా వరంగల్ నగరానికి మరోసారి అధిక ప్రాధాన్యం లభించింది. వరదనీటి నిర్వహణ, చారిత్రక కట్టడాల పునరుద్ధరణ, రవాణా సదుపాయాల మెరుగుదల వంటి కీలక రంగాల్లో ఈ నిధులతో పనులు చేపట్టనున్నారు. ప్రాజెక్టుల అమలుతో రాష్ట్రంలోని ప్రధాన పట్టణాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడటంతోపాటు ప్రజలకు మెరుగైన సేవలు అందుబాటులోకి రానున్నాయి.

యూసీఎఫ్ మార్గదర్శకాల ప్రకారం ఈ ప్రాజెక్టుల వ్యయంలో కేంద్ర ప్రభుత్వం 20 నుంచి 25 శాతం వరకు భరించనుంది. కేంద్రం కేటాయించే నిధులకు సమానంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా వాటా సమకూర్చనుంది. మిగిలిన మొత్తాన్ని పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ విధానంలో పనులు దక్కించుకునే ప్రైవేటు సంస్థలు పెట్టుబడిగా వెచ్చించనున్నాయి.

మిగతాది 2 లో..

కొత్త ఓటర్లకు భారీ ఊరట!

ఓటర్ల నమోదులో ఈసీ కీలక మార్పు

ఫారం-6 నుంచి ఎస్ఐఆర్ డిక్లరేషన్ వేరు

డిక్లరేషన్ విడిగా సమర్పించాల్సిందే

అన్ని రాష్ట్రాలకూ కొత్త నిబంధన

ఈసీ సమావేశాలకు కొత్త విధానం

సమావేశాల అజెండా ముందుగానే జారీ

ఐటీ మాడ్యూళ్ల పరిశీలనకు ప్రత్యేక కమిటీ



2 లో

న్యూస్ డెస్క్, 05 నవంబర్ (ఇది కద నిజం): ఓటర్ల నమోదు ప్రక్రియలో కేంద్ర ఎన్నికల సంఘం ఓ కీలక నిర్ణయం తీసుకుంది. ఆన్‌లైన్ ద్వారా కొత్త ఓటు నమోదు కోసం సమర్పించే ఫారం 6 నుంచి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ డిక్లరేషన్‌ను ఈసీ పూర్తిగా వేరు చేసింది. ప్రస్తుతం కొన్ని రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియ కొనసాగుతున్నప్పటికీ, అన్ని రాష్ట్రాలకూ ఈ నిబంధన వర్తిస్తుందని స్పష్టం చేసింది. ఇకపై ఓటర్ జాబితా లో పేరు చేర్చుకోవాలనుకునే పౌరులు ఆన్‌లైన్ ఫారం 6 నింపేటప్పుడు ఈ డిక్లరేషన్‌ను జత చేయాల్సిన అవసరం ఉండదు, దానిని విడిగా సమర్పించాల్సి ఉంటుంది.

మోదీ దేశద్రోహి.. ఐదు నిమిషాల్లో నిరూపిస్తా!

మోదీపై రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు

ఐదు నిమిషాల్లో నిరూపిస్తానంటూ సవాల్

ట్రంప్ నియంత్రణలో మోదీ ఉన్నారంటూ విమర్శ

ఏడాదిలోపే కేంద్ర ప్రభుత్వం కూలుతుందని వ్యాఖ్య

అదానీ పోర్టులో డ్రగ్స్‌పై అమిత్ షాకు ప్రశ్న

మణిపూర్ పరిస్థితిపై కేంద్రాన్ని నిలదీత

పంజాబ్‌లో డ్రగ్స్ నిర్మూలనపై ఆప్‌కు చురకలు

సీఎం భగవంత్ మాన్‌పై రాహుల్ విమర్శలు



2 లో

న్యూస్ డెస్క్, 05 నవంబర్ (ఇది కద నిజం): కేంద్రం ప్రభుత్వం పై, ప్రధాని నరేంద్రమోదీ పై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రధాని మోదీ 'దేశద్రోహి' అని, ఆయనను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నియంత్రిస్తున్నారని ఆరోపించారు. తనతో చర్చకువస్తే మోదీ దేశ ద్రోహి అనే ఆ విషయాన్ని ఐదు నిమిషాల్లో నిరూపిస్తానని అన్నారు.

ఈ అంశంపై చర్చకు రావాలని ప్రధానికి సవాల్ విసిరితే పార్లమెంటులో చర్చిద్దామని ఎన్డీయే నేతలు అంటున్నారని చెప్పారు.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
శుక్రవారం 06-11-2026

కంకణం కట్టుకున్నా.. చేసి చూపిస్తా!



న్యూస్ డెస్క్, 05 నవంబర్ (ఇది కద నిజం): ఎస్ఎల్బీసీ సొరంగ మార్గం పూర్తయితే ఎంత కరువు వచ్చినా శ్రీశైలం డెడ్ స్టోరేజ్ నుండి నీటిని తీసుకొని రైతులకు సాగునీరు అందించవచ్చని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. గురువారం ఆయన నల్లగొండ జిల్లా కేంద్రంలోని జిల్లా మార్కెటింగ్ శాఖ కార్యాలయంలో నిర్వహించిన నల్లగొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రమాణ స్వీకారానంతరం మంత్రి మాట్లాడుతూ.. మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్ల పదవులు అత్యంత కీలకమైనవని, రైతులకు సంబంధించి ఈ పదవులకు ఎంతో ప్రాముఖ్యత ఉందని, రైతులకు సేవ చేసే అవకాశం వీటి ద్వారా లభిస్తుందని అన్నారు. నూతన పాలకవర్గం రైతుల సంక్షేమానికి కృషి చేయాలని ఆయన కోరారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నల్లగొండ మార్కెట్‌కు సంబంధించి రెండవ పాలకవర్గాన్ని ఏర్పాటు చేసుకోవడం సంతోషకరమని అన్నారు. గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రవేశపెట్టిన ఉచిత విద్యుత్తును ప్రస్తుతం అన్ని రాష్ట్రాలలో అమలు చేస్తున్నాయని, ఇది గర్వకారణం అని అన్నారు.

ఎస్ఎల్బీసీ ద్వారా ఫ్లోరైడ్ సమస్యను పరిష్కరించడమే కాకుండా జిల్లా అంతటికి సాగునీరు అందించాలన్న ఉద్దేశంతో 2000 కోట్ల రూపాయలతో చేపట్టిన ఎస్ఎల్బీసీ ప్రాజెక్టు పనులు గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోగా, ప్రజాపాలన ప్రభుత్వం వచ్చిన తర్వాత పనులను తిరిగి చేపట్టామని, దురదృష్టవశాత్తు మధ్యలో మళ్లీ పనులు ఆగగా ఇటీవలే పనులు ప్రారంభించి చురుకుగా కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు. బ్రాహ్మణ వెల్లేములను కూడా తమ హయాంలోనే చేపట్టడం జరిగిందని, ఇప్పటివరకు 35000 ఎకరాలకు సాగునీరు అందించగా, లక్ష ఎకరాలకు తాగునీటిని అందించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని చెప్పారు. ఎస్ఎల్బీసీ ద్వారా జిల్లా మొత్తం సస్యశ్యామలం చేయడానికి కంకణం కట్టుకొని పని చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. రైతులకు సేవ చేయడం అదృష్టంగా ప్రతి ఒక్కరూ భావించాలని అన్నారు. ఏఎంఆర్పీ కాలువల లైనింగును 450 కోట్ల రూపాయలు తో చేపట్టడం జరిగిందని, ముశంపల్లి సబ్ స్టేషన్ మంజూరు చేయించడం జరిగిందని, అలాగే రోడ్డు మంజూరు చేయించామని తెలిపారు. జిల్లాలో కాలువలు, రిజర్వాయర్లు పూర్తయితే చుట్టుపక్కల బోర్లు రీఛార్జ్ అవుతాయని అన్నారు. రెండేళ్లలో జిల్లాలో మట్టి రోడ్డు కూడా లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు.

నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్‌లో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి జిల్లా, రాష్ట్ర ప్రజలకు ముందస్తుగా దీపావళి శు భాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్, నల్లగొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ గుమ్మల మోహన్ రెడ్డి, జిల్లా మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు ఛాయాదేవి, తదితరులు హాజరయ్యారు. కాగా నల్గొండ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బీ. హేమలత వెంకటరెడ్డి, వైస్ చైర్మన్‌గా వి. శ్రీనివాస్ గౌడ్‌తో పాటు, డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు ఛాయాదేవి వీరి చేత ప్రమాణ స్వీకారం చేయించారు.

యుద్ధమే కొంపముంచింది

మొదటి పేజీ తరువాయి

తమ పార్టీ మద్దతుదారులు ఎన్నికల్లో పెద్ద ఎత్తున ఓటింగ్ పోలింగ్‌కు హాజరైనప్పటికీ, 2024లో డోనాల్డ్ ట్రంప్‌కు ఓటు వేసిన చాలామంది ఓటర్లు ఈసారి డెమొక్రాట్లకు ఓటు వేయడమే ఓటమికి ప్రధాన కారణమని ఆయన స్పష్టం చేశారు.

ఆ నాలుగు అంశాలు..

తమ విశ్లేషకులు భావించినట్లుగా మద్దతుదారులు ఓటు వేయడానికి రాలేదనేది నిజం కాదని, ఫ్లోరిడా వంటి రాష్ట్రాల్లో ఓటర్లు పెద్ద ఎత్తున వచ్చారని జేడీ వాన్స్ పేర్కొన్నారు. అయితే, 2024లో ట్రంప్, వాన్స్‌కు ఓటు వేసిన చాలామంది ఓటర్లు తీవ్ర అసంతృప్తితో ఈసారి ప్రత్యర్థి డెమొక్రాట్లకు ఓటేశారని డేటా ఆధారంగా పొలిటికల్ అనలిస్టులు విశ్లేషించారని తెలిపారు. ఓటర్లు తమను వీడి వెళ్లడానికి, తిరిగి పార్టీకి మద్దతు ఇవ్వాలంటే కోరుతున్న నాలుగు ముఖ్య అంశాలను వాన్స్ వెల్లడించారు. అందులో యుద్ధాన్ని వెంటనే ముగించడం, జీవన వ్యయంతో పాటు ద్రవ్యోల్బణంపై దృష్టి సారించడం, 'అమెరికా ఫస్ట్' విధానాన్ని ఖచ్చితంగా అమలు చేయడం, ఇజ్రాయెల్‌తో అమెరికా సంబంధాలలో మార్పులు తీసుకురావడం వంటివి ఉన్నాయని తెలిపారు.

ప్రధాన కారణం యుద్ధమే..

మధ్యంతర ఎన్నికల్లో తాము ఓడిపోవడానికి అసలు సిసలైన కారణం యుద్ధమేనని.. ఈ విషయాన్ని ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ స్వయంగా నిన్న రాత్రి ఈ విషయాన్ని అంగీకరించారని జేడీ వాన్స్ కుండబద్దలు కొట్టారు. యుద్ధం ద్వారా సెనెట్‌ను కోల్పోవడం సరైన మూల్యమే అని ఎవరైనా సమర్థించుకుంటే అది వారి వ్యక్తిగత అభిప్రాయం కావచ్చు కానీ, ఓటమికి యుద్ధమే కారణమనేది నిజమని ఆయన అన్నారు. రాబోయే కొన్ని నెలల్లో ఓటమిపై రకరకాల చర్చలు, క్షమాభిక్ష వంటి ప్రతిపాదనలు తెరపైకి రావచ్చు కానీ, చట్టవిరుద్ధంగా కార్మికులను నియమించుకునే వ్యాపారాలపై కఠిన చర్యలు తీసుకోవడమే నిజమైన పరిష్కారమని పేర్కొన్నారు. పార్టీపై, ఎన్నికల ఫలితాలపై కోపంగా ఉన్న మద్దతుదారులు, ఆ కోపాన్ని తమ అనుకూలంగా కట్టుబడి ఉండే రిపబ్లికన్లను గెలిపించడానికి ఉపయోగించాలని, అందరం కలిసి మళ్లీ దేశాన్ని కాపాడుకునే పనిలో పడాలని జేడీ వాన్స్ పిలుపునిచ్చారు.

జల సంరక్షణకు ఉత్తమ్ ప్లాన్!



న్యూస్ డెస్క్, 05 నవంబర్ (ఇది కద నిజం): రాష్ట్రంలో భూగర్భజలాల సంరక్షణ, పునరుద్ధరణపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని భూగర్భజలాలను కాపాడేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఈ అంశంపై ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న జల సంరక్షణ కార్యక్రమాలను అధ్యయనం చేసి, తెలంగాణ అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. ఇవాళ కరువు ఉపశమనం, భూగర్భజలాల సంరక్షణపై ఉన్నతాధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష నిర్వహించారు.ఈ సమీక్షలో నీటిపారుదల, పంచాయతీరాజ్ శాఖల అధికారులు హాజరయ్యారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి,భూగర్భజల, నీటిపారుదల ప్రణాళికలు, భూగర్భజలాల సంరక్షణ చర్యలకు కార్యాచరణ ప్రణాళిక ఖరారుపై చర్చించారు.

భూగర్భజలాల కోసం ప్రత్యేక బడ్జెట్:

భూగర్భజలాల పరిరక్షణకు అవసరమైన బడ్జెట్ కేటాయిస్తామని ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ తెలిపారు. అవసరమైతే ఇప్పటికే కేటాయించిన బడ్జెట్‌కు మించి కూడా నిధులు సమకూరుస్తామని హామీ ఇచ్చారు. భూగర్భజల శాఖ పనితీరు, ఇప్పటివరకు చేపట్టిన చర్యలు, భవిష్యత్తులో అమలు చేయాల్సిన కార్యక్రమాలపై సమగ్ర సమీక్ష నిర్వహించాలని అధికారులకు సూచించారు. అన్ని జిల్లాల భూగర్భజల అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, జిల్లాలవారీగా భూగర్భజలాల స్థితిగతులను పరిశీలించాలని ఆదేశించారు.

రాజస్థాన్, మహారాష్ట్రలో జల సంరక్షణపై అధ్యయనం:

భూగర్భజలాల పునరుద్ధరణలో ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలను పరిశీలించాలని మంత్రి సూచించారు. ముఖ్యంగా రాజస్థాన్‌లో అమలు చేస్తున్న భూగర్భజల పునరుద్ధరణ చర్యలను, మహారాష్ట్రలో చేపడుతున్న జల సంరక్షణ కార్యక్రమాలను అధ్యయనం చేయాలని ఆదేశించారు. అక్కడి విజయవంతమైన విధానాలను తెలంగాణలోనూ అమలు చేసేందుకు అవకాశాలను పరిశీలించాలని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల అనుభవాలను వినియోగించుకుని భూగర్భజలాల పరిరక్షణ, పునరుద్ధరణ కార్యక్రమాలను మరింత బలోపేతం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

విదేశీ ఫండింగ్‌తో విష ప్రచారం!

న్యూస్ డెస్క్, 05 నవంబర్ (ఇది కద నిజం): దేశంలో ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు, విష ప్రచారాలు వ్యాప్తి చేస్తున్న పలువురు స్వయం ప్రకటిత నాయకులు, క్రియాశీలక వ్యక్తుల వెనుక భారత్ వ్యతిరేక శక్తులు, విదేశీ నిధులు ఉన్నాయని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ తీవ్ర ఆరోపణలు గుప్పించారు. అనధికారిక మార్గాలు, దేశంలోనూ విదేశాలలోనూ నడుస్తున్న భారత్ వ్యతిరేక స్వచ్ఛంద సంస్థల నుంచి వీరికి భారీగా నిధులు అందుతున్నాయనేందుకు స్పష్టమైన ఆధారాలు ఉన్నాయని ఆయన వెల్లడించారు.

విదేశీ ఫండింగ్, డీప్ స్టేట్ కుట్ర..

విదేశీ నిధులతో నడిచే స్వచ్ఛంద సంస్థలు, డీప్ స్టేట్ ఆపరేటివ్స్, భారత్ వ్యతిరేక శక్తులు కుమ్మక్కై దేశంలో ప్రభుత్వంపై, వ్యవస్థలపై కుట్రపూరిత కథనాలను వ్యాప్తి చేస్తున్నాయని జితేంద్ర సింగ్ ధ్వజమెత్తారు. ఇక కాక్రోచ్ జనతా పార్టీకి చెందిన అభిజీత్ దిప్కే అమెరికా ఆధారిత దాతల నుంచి నిధులు పొందుతుండగా.. అశుతోష్ రాంకా కు ఏకంగా పాకిస్థాన్ రాజకీయ నాయకులు, నిధుల ద్వారా చెల్లింపులు జరిగాయని జితేంద్ర సింగ్ ఆధారాలతో బయటపెట్టారు. ఇప్పటికైనా విదేశీ విరాళాల నియంత్రణ చట్టం విదేశీ నిధుల ప్రవాహాన్ని అరికట్టడానికి అత్యంత అవసరమని మంత్రి స్పష్టం చేశారు. తమను తాము ప్రజల గొంతుకగా చెప్పుకునే వారు నిధుల మూలాలను బహిర్గతం చేయాలని, ప్రచారాలకు డబ్బు ఎక్కడి నుంచి వస్తుందో స్పష్టం చేయాలని జితేంద్ర సింగ్ సవాల్ విసిరారు.

అయ్యప్ప సొసైటీపై కవిత అల్టిమేటం!

మొదటి పేజీ తరువాయి

ఆ భూములను కాపాడేందుకు ట్రస్ట్ ఛైర్మన్ విఠల్ రావు ఎంతో పోరాటం చేశారని అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఖానామెట్‌లోని అయ్యప్ప సొసైటీలో 500 నుంచి 700 వరకు అక్రమ భవనాలు వెలిశాయన్నారు. ప్రస్తుతం మరో 80 భవనాలు నిర్మాణంలో ఉన్నాయని ఆరోపించారు. కేవలం నోటరీల ద్వారా రిజిస్ట్రేషన్లు చేస్తూ, హైకోర్టు ఉత్తర్వులను సైతం లెక్కచేయకుండా 10 నుంచి 12 అంతస్తుల వరకు పర్మిషన్లు ఇస్తున్నారని మండిపడ్డారు. సర్వే నంబర్ 11/18 నుంచి 44 వరకు, సర్వే నంబర్ 12లో విచ్చలవిడిగా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు సాగుతున్నాయని ఆరోపించారు.

మీడియాను సైతం బెదిరిస్తారా?:

అయ్యప్ప సొసైటీలోని అక్రమ నిర్మాణాలపై గూగుల్ మ్యాప్‌తో సహా వార్తలు కవర్ చేయడానికి వెళ్లిన మీడియా ప్రతినిధులను ఇంటి యజమానులు బెదిరిస్తున్నారని కవిత తెలిపారు. మా వెనుక ప్రభుత్వం ఉంది అంటూ మీడియాను సైతం భయపెడుతున్నారని, కాంగ్రెస్ నడుపుతున్నది ప్రభుత్వమా? లేక రౌడీ రాజ్యమా? అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి సోదరులే దగ్గరుండి ఇటువంటి అక్రమ పర్మిషన్లు ఇప్పిస్తున్నారని ఆరోపించారు. మంథనిలో నిరుపేదల ఇళ్లను అర్ధరాత్రి కూల్చివేసిన ప్రభుత్వం, హైదరాబాద్‌లో ఇంత పెద్దఎత్తున జరుగుతున్న అక్రమ నిర్మాణాలను ఎందుకు ఆపడం లేదని నిలదీశారు. అయ్యప్ప సొసైటీ అంశంపై ఆర్టీఐ ద్వారా సమాచారం ఇవ్వాలని డిమాండ్ చేసిన కవిత... రాష్ట్రంలో ఆర్టీఐ వ్యవస్థ ఒక జోక్‌గా మారిందని విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే ఖానామెట్‌లో సమగ్ర సర్వే నిర్వహించి, అనుమతులు లేని, ఫైర్ సేఫ్టీ లేని భవనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

అమిత్ షా పర్యటనపై విమర్శలు.. ప్రభుత్వ తీరుపై ఆగ్రహం:

అమిత్ షా రాష్ట్ర పర్యటనపై కవిత స్పందిస్తూ... రాష్ట్రంలో 320 మండలాల్లో కరువు పరిస్థితులు ఉంటే ఆయన కేంద్రం తరఫున సాయం చేయడం మానేసి కేవలం రాజకీయం మాట్లాడి వెళ్లారని ఎద్దేవా చేశారు. రాష్ట్రానికి ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా జీహెచ్ఎంసీ ఎన్నికల్లో పోటీ చేస్తామనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అలాగే రాష్ట్రంలో గోదావరి, కృష్ణా నీటి లభ్యతపై ముఖ్యమంత్రి ఒక మాట, మంత్రి తుమ్మల మరో మాట చెబుతూ రైతులను అయోమయానికి గురిచేస్తున్నారని మండిపడ్డారు. విద్యుత్ కొరత సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేసిన ఆమె, గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో మహిళలు పెద్దఎత్తున భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

డీఎస్సీ-2026 నోటిఫికేషన్ విడుదల

న్యూస్ డెస్క్, 05 నవంబర్ (ఇది కద నిజం): ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు ప్రభుత్వం శుభవార్త అందించింది. రాష్ట్రంలోని వివిధ యాజమాన్యాల పరిధిలో 2,721 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించి డీఎస్సీ-2026 (ఏపీ టీఆర్టీ-2026) సమగ్ర నోటిఫికేషన్‌ను పాఠశాల విద్యాశాఖ బుధవారం విడుదల చేసింది. అర్హులైన అభ్యర్థుల నుంచి నవంబర్ 11వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. మొత్తం 2,721 పోస్టుల్లో 2,111 రెగ్యులర్ స్కూల్ అసిస్టెంట్, సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు ఉన్నాయి.

మరో 350 పోస్టులు ప్రత్యేక విద్యా ఉపాధ్యాయులకు కేటాయించారు. వీటిలో 150 స్పెషల్ ఎడ్యుకేషన్ స్కూల్ అసిస్టెంట్, 200 స్పెషల్ ఎడ్యుకేషన్ సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు ఉన్నాయి. అదేవిధంగా వివిధ సొసైటీల పరిధిలో 260 ప్రిన్సిపాల్, పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్, ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్, ఫిజికల్ డైరెక్టర్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులను భర్తీ చేయనున్నారు. అభ్యర్థుల విద్యా, వృత్తిపరమైన అర్హతలు, వయోపరిమితి, పరీక్షా విధానం, సిలబస్, పరీక్షల షెడ్యూల్, దరఖాస్తుల సమర్పణ విధానం, ఫీజు చెల్లింపు తదితర పూర్తి వివరాలను సమగ్ర నోటిఫికేషన్‌లో పొందుపరిచారు. పోస్టుల వారీగా, జిల్లా వారీగా, సబ్జెక్టుల వారీగా ఖాళీల వివరాలను కూడా వెల్లడించారు.

దరఖాస్తు సమయంలో కమ్యూనల్ కేటగిరీల వారీగా ఖాళీలు, రోస్టర్ పాయింట్లు, క్షితిజ సమాంతర రిజర్వేషన్ల వివరాలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయి. డీఎస్సీ--2026 నియామక పరీక్షలను కంప్యూటర్ ఆధారిత పరీక్ష విధానంలో నిర్వహించనున్నారు. పరీక్షల తేదీలు, షెడ్యూల్ వివరాలను కూడా నోటిఫికేషన్‌లో ప్రకటించారు. అభ్యర్థులు పూర్తి వివరాల కోసం పాఠశాల విద్యాశాఖ అధికారిక వెబ్‌సైట్ https://tet2dsc.apcfss.in/ ను సందర్శించాలని డీఎస్సీ-2026 కన్వీనర్ సూచించారు.

మోదీ దేశద్రోహి.. ఐదు నిమిషాల్లో నిరూపిస్తా!

మొదటి పేజీ తరువాయి

కానీ లోక్‌సభలో తాను మాట్లాడకుండా మైక్ కట్ చేస్తారని విమర్శించారు. దేశంలో మాదకద్రవ్యాల నిర్మూలనకు షా మూడేళ్ల గడువు పెట్టారని, అయితే అప్పటికి ఆయన ఆ పదవిలో ఉంటారో లేదో..? అని ఎద్దేవా చేశారు. తన అంచనా ప్రకారం ఏడాదిలోపే ప్రభుత్వం కూలిపోతుందని కీలక వ్యాఖ్యలు చేశారు.

పంజాబ్‌లోని సంగ్రూర్‌లో బుధవారం జరిగిన ఇన్సాఫ్ ర్యాలీలో రాహుల్‌గాంధీ మాట్లాడారు. తాను అమిత్ షాను ఒక్కటే అడగాలనుకుంటున్నానని, అదానీ ఓడరేవులో పట్టుబడిన మాదకద్రవ్యాల సంగతేంటి..? ఆ విషయంలో మీరు తీసుకున్న చర్యలేమిటి..? అని ప్రశ్నించారు. మీరు పైకి శాంతిభద్రతల గురించి మాట్లాడుతున్నారని, కానీ మీరు గ్యాంగ్‌స్టర్లను ప్రోత్సహిస్తున్నారని దేశం మొత్తానికి తెలుసని అమిత్ షాను ఉద్దేశించి అన్నారు.

ఒకవేళ అమిత్ షా శాంతిభద్రతల గురించి మాట్లాడాలనుకుంటే మణిపుర్‌లో ఏం జరుగుతుందో దేశానికి చెప్పాలని రాహుల్‌గాంధీ అన్నారు. పంజాబ్‌లో అధికారంలో ఉన్న ఆప్‌పైనా రాహుల్‌గాంధీ విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో ఆప్ అధికారంలోకి వచ్చిన తర్వాత డ్రగ్స్ సమస్యను పూర్తిగా నిర్మూలిస్తామని భగవంత్ మాన్ ప్రభుత్వం హామీ ఇచ్చిందని, కానీ వారు ఎక్కడ నిర్మూలించారని ప్రశ్నించారు. పంజాబ్‌లో ఏ ఒక్క ప్రాంతం నుంచైనా వారు డ్రగ్స్‌ను నిర్మూలించారా..? అని నిలదీశారు.

సమస్యను అంతంచేసే సామర్థ్యం వారికి లేదని రాహుల్‌గాంధీ ధ్వజమెత్తారు. గతంలో లోక్‌సభలో భగవంత్ మాన్‌తో కలిసి కూర్చున్న సమయంలో ఆయన జోకులు వేసేవారని, ఆయన వద్ద మద్యం వాసన వచ్చేదని ఆరోపించారు. మాదక ద్రవ్యాలపై పోరాడలనుకుంటే ముఖ్యమంత్రి మద్యం మత్తులో ఉండకూడదని మాన్‌కు రాహుల్ చురకలంటించారు. సభలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సచిన్ పైలట్ కూడా పాల్గొన్నారు.

కొత్త ఓటర్లకు భారీ ఊరట!

మొదటి పేజీ తరువాయి

ఎలక్షన్ కమిషన్‌లో పారదర్శకత పెంచడానికి, నిర్ణయాల ప్రక్రియను సులభతరం చేయడానికి తీసుకుంటున్న అనేక కొత్త మార్పుల్లో భాగమే ఈ నిర్ణయమని ఈజీ స్పష్టం చేసింది. అంతర్గత నిర్వహణకు సంబంధించి ఈసీ మరికొన్ని ప్రాధాన్యమైన మార్పులను కూడా తీసుకొచ్చింది. అందులో ముఖ్యంగా ఈసీ అధికారుల సమావేశాలు నిర్వహించే విధానంలో స్పష్టమైన మార్పులు వచ్చాయి. ఇకపై సమావేశాల అజెండాను ముందుగానే సభ్యులకు పంపుతారు. అలాగే మీటింగ్ ముగిశాక అధికారికంగా మినిట్స్ కూడా జారీ చేస్తారు. గతంలో ఈ పద్ధతి అమలులో ఉండేది కాదు. అలాగే ఈసీ అధికారుల విదేశీ పర్యటనల నిబంధనల్లో కూడా మార్పులు చేశారు. ఎన్నికల సంఘంలో పనిచేసే అధికారులు విదేశాలకు వెళ్లాల్సి వస్తే ముందస్తుగా ఈసీ అనుమతి తీసుకోవడాన్ని తప్పనిసరి చేశారు. గతంలో ఈ రకమైన అనుమతి తీసుకునే విధానం ఉండేది కాదు.

మరోవైపు కొత్త ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మోడ్యూళ్ల అభివృద్ధి ప్రక్రియలో కూడా కీలక మార్పు తీసుకొచ్చారు. గతంలో కొత్త ఐటీ మోడ్యూళ్ల ఆమోదం విషయంలో చీఫ్ ఎలక్షన్ కమిషనర్, ఎలక్షన్ కమిషనర్ల మధ్య తీవ్ర విభేదాలు, వివాదాలు ఉండేవి. అందుకే ఈ ప్రక్రియను మరింత పటిష్టం చేస్తూ, కొత్త ఐటీ మోడ్యూళ్ల ప్రతిపాదనలను నేరుగా కమిషన్ ముందుకు కాకుండా, ముందుగా ఒక ప్రత్యేక కమిటీకి పంపుతారు. అక్కడ పూర్తి స్థాయి పరిశీలన పూర్తయిన తర్వాతే తుది పరిశీలన కోసం ఎలక్షన్ కమిషన్ ముందుకు తీసుకొస్తారు.

ఇవి ఎలక్షన్లా.. సెలక్షన్లా?

న్యూస్ డెస్క్, 05 నవంబర్ (ఇది కద నిజం): రాష్ట్రంలో జరుగుతున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియపై మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద టీడీపీ నేతలు చేస్తున్న దౌర్జన్యాలు, అరాచకాలు చేస్తున్నారంటూ ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అసలు ఇవి ఎన్నికలా.. లేక సెలక్షన్లా అని ప్రశ్నించారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలకు ఎన్నికలని అంటారా అని నిలదీశారు. ఎన్నికల ప్రక్రియను మొత్తం కబ్జా చేశారని, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరగడంలేదన్నారు. దేశచరిత్రలో ఇలాంటి ఎన్నికలు జరగలేదని చెప్పారు. మహాభారతంలో శకుని మాయాపాచికల మాదిరిగానే ఇప్పుడు ఎన్నికల్లో అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని మండిపడ్డారు. హామీలు అమలు చేయలేదు కాబట్టే ఎన్నికల్లో అక్రమాలు చేస్తున్నారని జగన్ మోహన్ రెడ్డి విమర్శించారు.

వ్యవస్థలను హైజాక్ చేశారు..

ఎన్నికల షెడ్యూల్ వచ్చినప్పటి నుంచి వ్యవస్థలను హైజాక్ చేశారని వైఎస్ జగన్ ఆరోపించారు. తమ అభ్యర్థుల నామినేషన్లను సైతం అడ్డుకున్నారని ధ్వజమెత్తారు. స్క్రూటినీలోనూ తమ అభ్యర్థుల పేపర్లు తీసి నామినేషన్లను తిరస్కరించారని జగన్ ఆరోపణలు చేశారు. కూటమి నాయకులకు పోలీసులు, అధికారులు అనుకూలంగా పని చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు 17 మున్సిపల్ చైర్మన్ స్థానాలకు నామినేషన్లు వేయనివ్వలేదని, పోలింగ్ బూతుల్లోకి తమ ఏజెంట్లను రానివ్వలేదని మండిపడ్డారు. కూటమి నాయకులు రిగ్గింగ్ కు పాల్పడుతుంటే పోలీసులు, ఎన్నికల అధికారులు పేక్షక పాత్ర వహించారని విమర్శించారు. 84 జెడ్పీటీసీ స్థానాల్లో అసలు వైసీపీ అభ్యర్థులను నామినేషన్లు వేయనివ్వలేదని వైఎస్ జగన్ ఆవేదన వ్యక్తం చేశారు.

బస్సు కదలాలంటే డోరు మూయాల్సిందే..

మొదటి పేజీ తరువాయి

మణుగూరు ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్న 24 ఏళ్ల గుండ్ల ప్రవళిక.. మణుగూరు నుంచి భద్రాచలం వెళ్తున్న పల్లె వెలుగు బస్సులో విధులు నిర్వహిస్తున్నారు. అదే బస్సులో ప్రయాణిస్తున్న ఓ మహిళతో టికెట్, చిల్లర డబ్బుల విషయంలో వివాదం తలెత్తినట్లు సమాచారం. ఈ క్రమంలో ప్రయాణికురాలు ప్రవళికను కదులుతున్న బస్సు నుంచి కిందకు తోసినట్లు పోలీసులు వెల్లడించారు. దీంతో బస్సు వెనుక చక్రాల కింద పడిన ప్రవళిక రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. తొలుత భద్రాచలంలో చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. సుమారు 10 రోజుల పాటు చికిత్స పొందిన ఆమె నవంబర్ 3వ తేదీన కన్నుమూశారు. ఈ ఘటన ఆర్టీసీ సిబ్బంది భద్రతపై ఆందోళనకు దారితీసింది. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సంస్థ నిర్ణయించింది.ఆర్టీసీ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం తాజాగా అధికారిక సర్యులర్ జారీ చేసింది. అన్ని డిప్యూటీ రీజినల్ మేనేజర్లు తమ పరిధిలోని బస్సుల్లో ప్రయాణికుల తలుపుల పనితీరును తనిఖీ చేయాలని ఆదేశించింది. డోర్లు సక్రమంగా పనిచేస్తున్నాయా.. వాటిని సులభంగా తెరవడం, మూసివేయడం సాధ్యమవుతోందా అనే అంశాలను పరిశీలించాలి. ఏవైనా లోపాలు గుర్తిస్తే వెంటనే మరమ్మతులు చేయించాలని సూచించింది. ముఖ్యంగా డోర్లు అమర్చిన బస్సుల్లో అవి పూర్తిగా మూసిన తర్వాతే డ్రైవర్లు వాహనాలను నడపాలని స్పష్టం చేసింది. ప్రయాణ సమయంలో తలుపులు తెరుచుకోకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఈ నిబంధనలను క్షేత్రస్థాయిలో కచ్చితంగా అమలు చేయాల్సిన బాధ్యత అధికారులదేనని పేర్కొంది.

పల్లె వెలుగు నుంచి లహరి స్లీపర్ వరకు..ఈ నిబంధన రాష్ట్రంలోని అన్ని బస్సులకు వర్తిస్తుందని ఆర్టీసీ యాజమాన్యం తెలిపింది. పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్, సూపర్ లగ్జరీ, రాజధాని, లహరి స్లీపర్ వంటి ప్రయాణికుల తలుపులు కలిగిన బస్సులకు వర్తిస్తుందని పేర్కొంది. అయితే.. సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ వంటి కొన్ని సర్వీసుల్లో ప్రత్యేక ప్రయాణికుల డోర్లు ఉండవు. కాబట్టి కొత్త ఆదేశాలు డోర్లు అమర్చిన బస్సులకే వర్తిస్తాయని అధికారులు స్పష్టం చేశారు. ప్రస్తుతం తెలంగాణ ఆర్టీసీ దాదాపు 9,900 బస్సులతో ప్రయాణికులకు సేవలు అందిస్తోంది. ఈ నేపథ్యంలో సంస్థకు చెందిన బస్సులతో పాటు అద్దె, ఎలక్ట్రిక్ బస్సుల్లోనూ అందుబాటులో ఉన్న తలుపుల పనితీరును పరిశీలించాల్సి ఉంటుంది. ప్రయాణికులు ఎక్కడం, దిగడం పూర్తి అయిన తర్వాత తలుపులు మూసి ఉన్నాయా లేదా అనే అంశంపై కూడా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

తెలంగాణకు నిధుల వరద!

మొదటి పేజీ తరువాయి

ఈ విధానం ద్వారా ప్రభుత్వంపై పూర్తి ఆర్థిక భారం పడకుండా భారీ ప్రాజెక్టులను చేపట్టేందుకు అవకాశం ఏర్పడుతుంది. కేంద్రం తాజాగా ఆమోదించిన ఐదు ప్రాజెక్టుల్లో హైదరాబాద్, వరంగల్, హనుమకొండ, అలంపూర్ ప్రాంతాలకు సంబంధించిన పనులు ఉన్నాయి.

హైదరాబాద్ జలమండలి ఆధ్వర్యంలో చేపట్టనున్న గోదావరి తాగునీటి సరఫరా పథకం ఫేజ్-2, ఫేజ్-3 పనులకు రూ.1,992 కోట్లతో ఆమోదం లభించింది. నగర భవిష్యత్తు తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. మరోవైపు వరంగల్ మున

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
శుక్రవారం 06-11-2026

స్వర్ణగిరి వేంకటేశ్వరుని సన్నిధిలో పవిత్ర ఏకాదశి వేడుకలు







ఇది కద నిజం: యాదాద్రి భువనగిరి జిల్లాలోని స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దివ్యక్షేత్రంలో పరాభవ నామ సంవత్సరం, ఆశ్వీయుజ మాస ఏకాదశి గురువారాన్ని పురస్కరించుకుని స్వామివారి విశేష పూజలు, తిరువీధి ఉత్సవం అంగరంగ వైభవంగా జరిగాయి. బ్రహ్మముహూర్తంలో అర్చకస్వాములు సుప్రభాత సేవతో కార్యక్రమాలను ప్రారంభించి, అనంతరం గోపృష్ట దర్శనాన్ని నిర్వహించారు. ఏకాదశి సందర్భాన్ని పురస్కరించుకుని ప్రాతఃకాలంలో స్వామివారికి 'నవ కలశ పంచామృత అభిషేకం' ఘనంగా జరిపారు. ఉదయం 5:30 గంటలకు మేళతాళాలు, మంగళ ధ్వనుల నడుమ తీసుకవచ్చిన సుగంధ పుష్పమాలలు, పట్టు పీతాంబరాలను 'తోమాల సేవ', 'మేల్ చాట్ వస్త్ర సేవ'లలో సమర్పించి అలంకరించారు.

గురువారం ప్రత్యేక సేవలో భాగంగా లోకంలో ఆహార కొరత తీరాలని కాంక్షిస్తూ స్వామివారికి 'తిరుప్పావడ సేవ' (అన్నకూటోత్సవం) నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 450 కిలోల అన్నప్రసాదం, లడ్డూ, వడలతో స్వామివారికి నైవేద్యం సమర్పించి వేదమంత్రోచ్చారణల మధ్య హారతులిచ్చారు. ఉదయం 10:30 గంటలకు వైభోత్సవ మండపంలో శ్రీవారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించగా, భక్తులు తిలకించి పులకించిపోయారు. ఈరోజు క్షేత్రంలో ఏర్పాటు చేసిన నిత్యాన్నప్రసాద వితరణలో 5,000 మందికి పైగా భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం 6:30 గంటలకు స్వామివారి తిరువీధి ఉత్సవం మాడవీధుల్లో గోవింద నామస్మరణలు, మంగళవాయిద్యాల మధ్య శోభాయమానంగా సాగింది. అనంతరం దేదీప్యమానమైన సహస్రదీప కాంతుల నడుమ ఊయల సేవ నిర్వహించి, కర్పూర మంగళహారతులు సమర్పించగా భక్తులు స్వామివారిని దర్శించుకుని తరించారు.

ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య చొరవతో మహిళా భవన్ కు భూమి పూజ



ఇది కద నిజం ,తుర్కపల్లి, నవంబర్ 5: ఆలేరు నియోజకవర్గం, తుర్కపల్లి మండలం బాబుల్ నాయక్ తండాలో మహిళా భవన నిర్మాణానికి గురువారం ఘనంగా భూమి పూజ నిర్వహించారు. ఆలేరు శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య చొరవతో, ప్రత్యేక నిధులతో ఈ మహిళా భవనం నిర్మాణం చేపట్టారు. ఈ కార్యక్రమానికి స్థానిక సర్పంచ్ మాదోత్ మంగీతి W/o స్వర్గీయ ధర్మనాయక్ మాజీ ఎంపీటీసీ ధనావత్ మోహన్ బాబు నాయక్ ముఖ్య అతిథులుగా హాజరై భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మంగీతి మాట్లాడుతూ మహిళల సంక్షేమం కోసం ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఎంతో కృషి చేస్తున్నారని, ఈ భవనం వల్ల మహిళా సంఘాలకు, స్వయం సహాయక సంఘాల మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. మాజీ ఎంపీటీసీ మోహన్ బాబు నాయక్ మాట్లాడుతూ గ్రామంలో మహిళలకు ప్రత్యేక భవనం ఏర్పాటు కావడం చాలా సంతోషంగా ఉందని, మహిళల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. అదేవిధంగా స్థానిక ఎమ్మెల్యే కి విన్నపం ఏమనగా గ్రామపంచాయతీ భవనం కూడా ఏర్పాటు చేస్తే బాగుంటుంది అని తెలియజేసి దీనికి ప్రత్యేకంగా నిధులు ఏర్పాటు చేయవలసిందిగా మనవి చేస్తున్నాము. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వార్డు మెంబర్లు మహిళా సంఘాల సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బీజేపీ వైపే తెలంగాణ యువత చూపు

: రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు





హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గోషామహల్ నియోజకవర్గం, జాంబాగ్ డివిజన్‌కు చెందిన పలువురు ప్రముఖులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు మరియు పాతబస్తీకి చెందిన పెద్ద సంఖ్యలో యువత భారతీయ జనతా పార్టీలో చేరారు. బీజేపీ గోల్కొండ జిల్లా కార్యదర్శి వి. గణేష్ యాదవ్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో, తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు కొత్తగా చేరిన వారికి కాషాయ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జాంబాగ్ డివిజన్‌కు చెందిన శ్రీనివాస్ యాదవ్, బీఆర్ఎస్ నుంచి విచ్చేసిన భాస్కర్‌తో పాటు రాజ్‌పుత్ సమాజ్ ప్రతినిధులు ఆదిత్య, బాలపరమేశ్, ధరమ్‌కుమార్, అమర్‌నాథ్, ప్రేమ్‌కుమార్, గణేశ్, పవన్‌కుమార్, మహేశ్, బాలాజీ, మంగీలాల్, రూపేశ్, హరీశ్, మహేందర్, విక్రమ్, రాజేశ్, రమేశ్ ముదిరాజ్, రాహుల్, సుమీత్, అరుణ్, హరి కిషన్ తదితరులు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. అనంతరం ఎన్. రామచందర్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల ప్రజా వ్యతిరేక విధాన విసిగిపోయిన ప్రజలకు, యువతకు బీజేపీ ఒక్కటే బలమైన ప్రత్యామ్నాయంగా కనిపిస్తోందని తెలిపారు. దేశ, రాష్ట్రాల భద్రత, అభివృద్ధికి ప్రధాని నరేంద్ర మోదీ దూరదృష్టి, సమర్థవంతమైన నాయకత్వమే శ్రీరామరక్ష అని, ఆయనపై ఉన్న విశ్వాసంతోనే పెద్ద ఎత్తున చేరికలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయశ్రీ, రాష్ట్ర ప్రధాన అధికార ప్రతినిధి మరియు మీడియా ఇన్‌చార్జ్ ఎన్.వి. సుభాష్, రాష్ట్ర అధికార ప్రతినిధి సందీప్,గోల్కొండ జిల్లా ప్రెసిడెంట్ ఉమామహేందర్, సాయిలతో పాటు పలువురు ముఖ్యాధికారులు, నాయకులు పాల్గొన్నారు.



యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి హుండీ ఆదాయం రూ.2.60 కోట్లు





ఇది కద నిజం,యాదాద్రి: యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి హుండీ ఆదాయం భారీగా సమకూరింది. గత 44 రోజులుగా భక్తులు స్వామివారికి సమర్పించిన కానుకలను లెక్కించగా మొత్తం రూ.2 కోట్ల 60 లక్షల 59 వేల 278 రూపాయల ఆదాయం వచ్చినట్లు దేవస్థాన అధికారులు వెల్లడించారు. కొండ క్రింద సత్యనారాయణ వ్రత మండపం లో నిర్వహించిన హుండీ లెక్కింపులో నగదు రూపంలో రూ.2,60,59,278 ఆదాయం సమకూరింది. ఇక హుండీ ద్వారా భక్తులు సమర్పించిన కానుకల్లో మిశ్రమ బంగారం 65 గ్రాములు, మిశ్రమ వెండి 2 కిలోల 650 గ్రాములు ఉన్నట్లు ఆలయ ఈవో భవాని శంకర్ వెల్లడించారు. అదేవిధంగా విదేశీ కరెన్సీ కూడా భారీగా లభించింది. అమెరికా డాలర్లు 280, బ్రిటన్ పౌండ్లు 85, కెనడా డాలర్లు 20, ఆస్ట్రేలియా డాలర్లు 80, నేపాల్ కరెన్సీ 65, సౌదీ అరేబియా కరెన్సీ 210తో పాటు వియత్నాం కరెన్సీ లక్ష యూనిట్లు సహా పలు దేశాలకు చెందిన విదేశీ కరెన్సీ లభించింది. యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిపై భక్తులకు ఉన్న అపారమైన భక్తి విశ్వాసాలకు ఈ హుండీ ఆదాయం నిదర్శనంగా నిలుస్తోంది. స్వామివారి దర్శనానికి నిత్యం వేలాది మంది భక్తులు తరలివస్తూ తమ మొక్కులు చెల్లించుకుంటున్నారు.

రూ. లక్షల విలువైన 64 ఫోన్లు రికవరీ

బాధితులకు అప్పగించిన చంద్రాయణగుట్ట పోలీసులు



ఇది కద నిజం, హైదరాబాద్ : హైదరాబాద్‌లోని చంద్రాయణగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న, దొంగతనానికి గురైన 64 మొబైల్ ఫోన్‌లను పోలీసులు సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (CEIR) పోర్టల్‌ను సమర్థవంతంగా ఉపయోగించి విజయవంతంగా రికవరీ చేశారు. భారత ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన ఈ పోర్టల్ ద్వారా బాధితుల ఫోన్ల IMEI నంబర్లను ట్రాక్ చేస్తూ, నిరంతర పరిశోధనతో ఈ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సరైన ఆధారాలను ధృవీకరించి, అవసరమైన లాంఛనాలు పూర్తి చేసిన తర్వాత రికవరీ చేసిన ఫోన్లను వాటి అసలు యజమానులకు భద్రంగా అప్పగించారు. ?ఈ సందర్భంగా పోలీసులు ప్రజలకు పలు సూచనలు చేశారు. తమ మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్నా లేదా దొంగతనానికి గురైనా వెంటనే సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు. అదేవిధంగా తమ పరికరాలు దుర్వినియోగం కాకుండా ఉండటానికి, వాటిని త్వరగా గుర్తించడానికి అధికారిక CEIR పోర్టల్ (https://www.ceir.gov.in) లో వివరాలను నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఫోన్ల దొంగతనాలను అరికట్టడంలో ప్రజలు పోలీసులతో సహకరించాలని సూచించారు. ?చంద్రాయణగుట్ట ఏసిపి ఎ. సుధాకర్, ఎస్‌హెచ్‌ఓ ఆర్. రవీందర్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ బి. రామస్వామిల పర్యవేక్షణ మరియు మార్గదర్శకత్వంలో క్రైమ్ టీమ్ సభ్యులు హెచ్‌సి జి. నవనీత్ కుమార్, పిసిలు డి. నాగర్ బాషా, బి. నిశాంత్, బి. ప్రవీణ్, జి. సాయి ప్రసాద్‌లతో కూడిన బృందం శ్రమించి ఈ ఫోన్లను రికవరీ చేసింది. విశేష సమర్థత చూపిన క్రైమ్ సిబ్బందికి తగిన బహుమతులు అందజేసి అభినందించనున్నట్లు ఏసిపి తెలిపారు.

యాదాద్రిలో వైభవంగా ఏకాదశి వేడుకలు

శ్రీ లక్ష్మీనరసింహస్వామికి భక్తిశ్రద్ధలతో లక్ష పుష్పార్చన





ఇది కద నిజం,యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చక స్వాములు లక్ష పుష్పార్చన కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో చేపట్టారు. పాంచరాత్రాగమ శాస్త్ర సంప్రదాయాన్ని అనుసరిస్తూ అర్చకులు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. దేవస్థాన ప్రధానాలయ ముఖ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులను ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేసి, వివిధ రకాల పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, వజ్ర వైఢూర్యాలతో అత్యంత సుందరంగా అలంకరించారు. అనంతరం వివిధ రకాల సుగంధ పుష్పాలతో స్వామివారికి లక్ష పుష్పార్చన నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఏకాదశి పర్వదినం సందర్భంగా స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు ఆసక్తి చూపించారు. స్వామివారి నామస్మరణతో యాదాద్రి ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

తెలంగాణలోనూ జనసేన విజయకేతనం ఎగురవేస్తాం!

ఎమ్మెల్సీ ఎన్నికల్లో జనసేన సత్తా చాటుతాం : సోడి శెట్టి శివ నాగేశ్వర్ రావు





ఇది కద నిజం ,ఎల్బీనగర్: ఆంధ్రప్రదేశ్‌లో జనసేన పార్టీ సాధిస్తున్న విజయాలు తెలంగాణలోని జనసేన శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపుతున్నాయని, పవన్ కళ్యాణ్ నాయకత్వ స్ఫూర్తితో తెలంగాణలోనూ పార్టీని బలోపేతం చేసి రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయకేతనం ఎగురవేస్తామని జనసేన నాయకుడు సోడి శెట్టి శివ నాగేశ్వర్ రావు అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో జనసేన పార్టీ విజయాల నేపథ్యంలో ఎల్బీనగర్ నియోజకవర్గంలో జనసేన నాయకులు, జనసైనికులు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి తమ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో సోడి శెట్టి శివ నాగేశ్వర్ రావుతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజల్లోకి వెళ్లే పార్టీ కాదని, నిత్యం ప్రజల సమస్యలపై పోరాడే రాజకీయ శక్తిగా ఎదగాలని ఆకాంక్షించారు. తెలంగాణలో పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రతి జనసైనికుడిపై ఉందన్నారు. కేవలం జెండాలు పట్టుకోవడం, సభలు నిర్వహించడం మాత్రమే కాకుండా ప్రజల కష్టసుఖాల్లో భాగస్వాములవుతూ, వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి విశ్వాసాన్ని చూరగొంటే తెలంగాణలోనూ జనసేనకు మంచి భవిష్యత్తు ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో జనసేన పార్టీ తన బలాన్ని నిరూపించుకుని విజయకేతనం ఎగురవేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పవన్ కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ తెలంగాణలో పార్టీ విస్తరణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సోడి శెట్టి శివ నాగేశ్వర్ రావు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, జనసైనికులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంబరాలు నిర్వహించారు.

పట్టభద్రుల ప్రతి ఓటూ ప్రజాస్వామ్యానికి కీలకం

తెలంగాణ రక్షణ సేన నేత నీరుడు సర్వేష్ ముదిరాజ్



ఇది కద నిజం, రాజేంద్రనగర్ : మహబూబ్‌నగర్–రంగారెడ్డి–హైదరాబాద్ గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కార్యక్రమం శంషాబాద్, రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలో ఉత్సాహంగా ప్రారంభమైంది. తెలంగాణ రక్షణ సేన పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ నీరుడు సర్వేష్ ముదిరాజ్ నేతృత్వంలోని బృందం ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అర్హులైన పట్టభద్రులకు ఓటరు నమోదు ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తూ, ప్రతి ఒక్కరూ నమోదు ప్రక్రియలో పాల్గొనేలా ప్రోత్సహించారు. అనంతరం నీరుడు సర్వేష్ ముదిరాజ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ముఖ్యంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతి ఒక్క అర్హుడి భాగస్వామ్యం ఎంతో అవసరమని స్పష్టం చేశారు. అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు తక్షణమే తమ ఓటును నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

వైభవంగా బిజెపి నాయకుడు గడ్డం సాయికిరణ్ జన్మదిన వేడుకలు

శుభాకాంక్షలు తెలిపిన వెంకట సాయి నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఏ. విజయేందర్ రెడ్డి



ఇది కద నిజం ,హైదరాబాద్: భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు గడ్డం సాయికిరణ్ జన్మదిన వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా వెంకట సాయి నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఏ. విజయేందర్ రెడ్డి మరియు అసోసియేషన్ టీమ్ సభ్యులు వేడుకల్లో పాల్గొని గడ్డం సాయికిరణ్‌కు శాలువా కప్పి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. సాయికిరణ్ ఎల్లప్పుడూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో విలసిల్లుతూ ప్రజాసేవలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వెంకట సాయి నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు రమేష్ శెట్టి, కోశాధికారి సీహెచ్ శ్రీనివాస్ గౌడ్, డాక్టర్ విద్యాసాగర్, అలాగే బిజెపి నాయకులు పోరెడ్డి మహేశ్వర్ రెడ్డి, పార్టీ అధికార ప్రతినిధి ఇలిటం నరసింహారెడ్డి, ప్రభాకర్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
శుక్రవారం 06-11-2026

మోటకొండూరు పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ ఆకాంక్ష యాదవ్

ఇది కద నిజం :యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ ఆకాంక్ష యాదవ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని వివిధ రికార్డులు, రిజిస్టర్లు, కేసుల వివరాలతో పాటు పోలీస్ శాఖలోని వివిధ వర్టికల్స్ పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతి, స్టేషన్ నిర్వహణ తీరు మరియు సిబ్బంది విధుల నిర్వహణపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. అనంతరం పోలీస్ సిబ్బందితో ముఖాముఖిగా మాట్లాడి వారి విధులు, ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించడంతో పాటు నేరాల నియంత్రణకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో నిరంతరం అప్రమత్తంగా ఉంటూ, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో మోటకొండూర్ ఎస్‌హెచ్‌ఓ బి. కుమారస్వామి, ఏఎస్ఐ ప్రకాష్‌తో పాటు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.





‘రామాయణ’లో యష్ హవా

బాలీవుడ్ ప్రతిష్టాత్మకంగా తెరకెక్కించిన ఎపిక్ డ్రామా ‘రామాయణ’ ఎట్టకేలకు ప్రేక్షకుల ముందుకు వచ్చేసింది. కళ్లు చెదిరే విజువల్స్, అద్భుతమైన ఎమోషన్స్‌తో రూపొందిన ఈ అద్భుత ఘట్టానికి సంబంధించి తొలి రివ్యూలు బయటికొచ్చేశాయి. అయితే అందరి దృష్టి రాముడి మీద ఉంటే.. ఇక్కడ మాత్రం ‘రావణాసురుడు’ షో మొత్తాన్ని తన వైపుకు తిప్పేసుకున్నాడు. మొన్నటి వరకు ‘టాక్సిక్’ సినిమా విషయంలో తీవ్ర విమర్శలు, నెగెటివిటీ ఎదుర్కొన్న యష్.. ఇప్పుడు ‘రామాయణ’తో మైండ్ బ్లోయింగ్ కమ్‌బ్యాక్ ఇచ్చాడు. తన స్క్రీన్ ప్రెజెన్స్, స్వాగ్‌ను మ్యాచ్ చేయడం ఎవరి తరం కాదని రావణుడి పాత్రతో మరోసారి నిరూపించాడు. ఒకరకంగా సినిమాలో యష్ యాక్టింగ్ వేరే లెవెల్ అని, రామాయణంలో షో స్టీలర్‌గా నిలిచాడంటూ ప్రశంసల వర్షం కురుస్తోంది. మరోవైపు రాముడిగా రణ్‌బీర్ కపూర్ తన అమాయకత్వం, హుందాతనంతో మెప్పించగా.. సీతగా సాయి పల్లవి, లక్ష్మణుడిగా రవి దూబే తమ పాత్రలకు పూర్తి న్యాయం చేశారు.

సినిమా ఫస్ట్ హాఫ్ అద్భుతంగా ఉందని ఆడియన్స్ ముక్తకంఠంతో చెబుతున్నారు. మేకర్స్ సృష్టించిన గ్రాండ్ వరల్డ్ బిల్డింగ్, పవర్‌ఫుల్ డైలాగ్స్ ప్రేక్షకులను కట్టిపడేస్తాయి. ముఖ్యంగా ఆస్కార్ విజేతలు ఏఆర్ రెహమాన్, హన్స్ జిమ్మర్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాకు ప్రాణం పోసింది. ఇక ఫస్ట్ హాఫ్‌లో వచ్చే ‘రావణుడు వర్సెస్ జటాయువు’ యాక్షన్ సీక్వెన్స్ అయితే ప్యూర్ సినిమాటిక్ బ్రిలియన్స్ అని, గూస్‌బంప్స్ గ్యారెంటీ అని చెబుతున్నారు. అయితే నిజానికి సీతను రావణుడు అపహరించడంతో ఈ మొదటి భాగాన్ని ముగించగా ఈ భాగానికి రావణుడికి స్క్రీన్ స్పేస్ ఎక్కువగా లభించింది. అలానే యష్ తనదైన స్క్రీన్ ప్రెజెన్స్ తో కొన్ని చోట్ల రణబీర్ ను సైతం డామినేట్ చేశారు.

ఓటీటీలోకి రాబోతున్న ‘418’



సెన్సేషనల్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ సమర్పణలో తెరకెక్కిన లేటెస్ట్ హారర్ మూవీ ‘418’. యంగ్ డైరెక్టర్ నాదగౌడ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో సూర్య రాజ్, చరణ్ లక్కరాజు, ప్రీతి పగడాల, చైత్ర ఆచార్ ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ చిత్రానికి వెంకీ జీజీ తనదైన నేపథ్య సంగీతంతో భయపెట్టగా.. టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ సినిమాను నిర్మించింది. భారీ అంచనాల నడుమ అక్టోబర్ 23న థియేటర్లలో విడుదలైన ఈ సినిమా ప్రేక్షకులను నుంచి మిక్స్‌డ్ టాక్‌ను రాబట్టింది. ఇక థియేటర్లలో సందడి చేసిన ఈ హారర్ మూవీ, ఇప్పుడు డిజిటల్ స్ట్రీమింగ్‌కు సిద్ధమైనట్లు టాక్. ఈ సినిమాకు సంబంధించిన డిజిటల్ ఓటీటీ హక్కులను ప్రముఖ సంస్థ ‘నెట్‌ఫ్లిక్స్’ దక్కించుకున్నట్లు సమాచారం. నవంబర్ 20 నుంచి ఈ సినిమా నెట్‌ఫ్లిక్స్ వేదికగా ఓటీటీలో స్ట్రీమింగ్ కాబోతున్నట్లు తెలుస్తోంది.

‘ఆదర్శ కుటుంబాన్ని’ ఆదుకునేది ఎలా



వెంకటేష్ హీరోగా తెరకెక్కిన ‘ఆదర్శ కుటుంబం’ సినిమా బాక్సాఫీస్ వద్ద ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంటోంది. ఎలాంటి పెద్ద పోటీ లేకుండా మొదటి ఆరు రోజులు పూర్తి చేసుకున్న ఈ చిత్రం, ఇప్పుడు సరికొత్త సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధమైంది. గురువారం రోజున ‘రామాయణ: పార్ట్ 1’ విడుదలవుతుండగా, శుక్రవారం సూర్య నటిస్తున్న ‘సీన్’తో పాటు ‘సమ్మర్ హాలిడేస్’ సినిమాలు థియేటర్లలోకి వస్తున్నాయి. దీనితో ఈ చిత్రానికి ఇప్పటివరకు ఉన్న సాఫీ ప్రయాణానికి బ్రేకులు పడినట్లయింది.

ప్రస్తుత ట్రెండ్ చూస్తుంటే, ఈ వెంకటేష్ సినిమా ప్రపంచవ్యాప్తంగా గరిష్టంగా రూ. 70 కోట్ల గ్రాస్ వసూళ్లతో థియేట్రికల్ రన్‌ను ముగించే అవకాశం ఉందని ఇండస్ట్రీ వర్గాలు అంటున్నాయి. దాదాపు రూ. 130 కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రానికి నాన్-థియేట్రికల్ రూపంలో మంచి డీల్ కుదిరినప్పటికీ, థియేట్రికల్ బిజినెస్ పరంగా మాత్రం భారీ నష్టాలు తప్పేలా లేవు. థియేట్రికల్ హక్కుల విలువను రాబట్టుకోవాలంటే సినిమా రూ. 100 కోట్లకు పైగా షేర్ వసూలు చేయాల్సి ఉంది. కానీ ప్రస్తుత పరిస్థితిని బట్టి చూస్తే, నిర్మాతకు దాదాపు రూ. 30 నుండి రూ. 40 కోట్ల వరకు నష్టాలు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.



సూపర్‌స్టార్ రజనీకాంత్ హీరోగా, సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన మోస్ట్ అవేటెడ్ బ్లాక్‌బస్టర్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ‘జైలర్ 2’ డిజిటల్ స్ట్రీమింగ్‌కు రంగం సిద్ధమైంది. బాక్సాఫీసర్ వద్ద అద్భుతమైన కలెక్షన్లతో దూసుకుపోయిన ఈ చిత్రం, ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ దిగ్గజం అమెజాన్ ప్రైమ్ వీడియో సొంతం చేసుకుంది. కాగా, నవంబర్ 12 నుంచి ఈ చిత్రం అమెజాన్ ప్రైమ్ వేదికగా వరల్డ్ వైడ్‌గా డిజిటల్ ప్రీమియర్ కానున్నట్లు ప్రైమ్ అధికారికంగా ప్రకటించింది. థియేటర్లలో భారీ విజయాన్ని అందుకున్న ఈ సినిమా, ఓటీటీలో కూడా సరికొత్త రికార్డులు సృష్టించేందుకు సిద్ధమవుతోంది.

తెలుగుతో పాటు తమిళ, హిందీ, మలయాళ, కన్నడ భాషల్లో ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ అందుబాటులో ఉండనుంది. అయితే ఈ సినిమా ఓటీటీ వెర్షన్‌కు సంబంధించి మరో ఆసక్తికరమైన చర్చ కూడా సినీ వర్గాల్లో జరుగుతోంది. థియేట్రికల్ రన్‌తో పోలిస్తే ఓటీటీలో రాబోయే వెర్షన్‌లో దాదాపు 30 నిమిషాల అదనపు ఫుటేజ్ ఉండొచ్చని ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా మోహన్‌లాల్, హృతిక్ రోషన్, విజయ్ సేతుపతి తదితరుల పాత్రలకు సంబంధించిన కొన్ని డిలీటెడ్ సీన్స్ లేదా పొడిగించిన సన్నివేశాలను ఓటీటీ వర్షన్‌లో జోడించే అవకాశం ఉందంటూ వస్తున్న వార్తలు అభిమానుల్లో మరింత అంచనాలను పెంచేస్తున్నాయి. అనిరుధ్ రవిచందర్ అందించిన మాస్ మ్యూజిక్, సన్ పిక్చర్స్ నిర్మాణ విలువలు ఈ చిత్రానికి మరింత బలాన్ని చేకూర్చగా, థియేటర్లలో రజనీకాంత్ ‘టైగర్ ముత్తువెల్ పాండియన్’ మానియాని మిస్ అయిన లేదా మరోసారి ఓటీటీలో ఎంజాయ్ చేయాలనుకునే సినీ ప్రియులకు ఇది గుడ్ న్యూస్ అనే చెప్పాలి.

నవంబర్ 12 నుంచి జైలర్ వేట

సూపర్ పవర్స్!



తెలుగు ఓటీటీ ప్రేక్షకులకు సస్పెన్స్, కామెడీ తోడైతే ఇక ఆ సినిమాకు తిరుగుండదు. సరిగ్గా ఇలాంటి వినూత్నమైన కాన్సెప్ట్‌తో వచ్చి, ఇప్పుడు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై సరికొత్త రికార్డులు సృష్టిస్తున్న చిత్రమే ‘ఇట్స్ ఎ మెడికల్ మిరాకిల్’. తీవ్ర అస్వస్థతతో కోమాలోకి వెళ్లిన ఒక సాధారణ వ్యక్తి అకస్మాత్తుగా కోలుకోవడం, ఆ తర్వాత అతనికి ఎక్కడో దూరం నుంచి వచ్చే శబ్దాలు, రహస్య సంభాషణలను కూడా స్పష్టంగా వినగలిగే అసాధారణ సూపర్ పవర్స్ రావడం అనే సెన్సేషనల్ పాయింట్‌తో తెరకెక్కిన ఈ సినిమా ఓటీటీలో దుమ్మురేపుతోంది. మనోరమా మ్యాక్స్ ఓటీటీ వేదికగా స్ట్రీమింగ్ అవుతున్న ఈ కామెడీ థ్రిల్లర్.. విడుదలైన మొదటి వారంలోనే ఏకంగా 15 మిలియన్ల (కోటిన్నర) నిమిషాలకు పైగా వాచ్ టైమ్‌ను సొంతం చేసుకుని ట్రెండింగ్‌లో నిలిచింది. థియేటర్లలో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించిన ఈ సినిమా, ఇప్పుడు తెలుగుతో పాటు మలయాళం, తమిళ, కన్నడ భాషల్లోనూ ఎక్స్‌క్లూజివ్‌గా అందుబాటులో ఉండటంతో నాలుగు భాషల ప్రేక్షకులు ఈ మూవీకి బ్రహ్మరథం పడుతున్నారు. ఇటీవలే ‘ప్రేమలు’ సినిమాలో అమల్ డేవిస్ పాత్రతో టాలీవుడ్ యూత్‌కు కూడా విపరీతంగా దగ్గరైన సంగీత్ ప్రతాప్ ఇందులో మెయిన్ లీడ్ (రూబిన్) పాత్రను పోషించగా, విలక్షణ నటుడు షరాఫుద్దీన్ (సూరజ్) ఒక ఫ్రెండ్లీ పోలీస్ ఆఫీసర్‌గా తనదైన మార్క్ యాక్టింగ్ తో ఆకట్టుకున్నాడు. సూపర్ పవర్స్ వచ్చిన రూబిన్‌కు, పోలీస్ ఆఫీసర్ సూరజ్‌కు మధ్య జరిగే ఊహించని పరిణామాలు, వారిద్దరి ప్రయాణంలో ఎదురయ్యే కిడ్నాప్‌లు, ఛేజింగ్‌లు, దాని చుట్టూ అల్లుకున్న హాస్యం, థ్రిల్లింగ్ ట్విస్టులు ఆడియన్స్‌ను కుర్చీ అంచున కూర్చోబెడతాయి.

డెబ్యూ డైరెక్టర్ శ్యామిన్ గిరీష్ తన మొదటి సినిమాతోనే దర్శకుడిగా అద్భుతమైన ప్రతిభ కనబరిచాడు. ‘కరిక్కు’ ఫేమ్ నీలీన్ సంద్ర అందించిన స్క్రీన్ ప్లే, డైలాగ్స్ సినిమాకు ప్రాణం పోశాయి. డా. పాల్స్ ఎంటర్‌టైన్‌మెంట్, డ్రీమ్ బిగ్ ఫిలిప్స్ బ్యానర్లపై డా. పాల్ వర్గీస్, సుజిత్ జే నాయర్ ఈ చిత్రాన్ని నిర్మించారు. మ్యూజిక్ డైరెక్టర్ ముజీబ్ మజీద్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ థ్రిల్లర్ ఫీల్‌ను నెక్ట్ లెవెల్‌కు తీసుకువెళ్లింది. ప్రస్తుతం 500కి పైగా బ్లాక్‌బస్టర్ సినిమాలు, 20 వేల గంటల ఎంటర్‌టైన్‌మెంట్ కంటెంట్‌తో దూసుకుపోతున్న మనోరమా మ్యాక్స్ ప్లాట్‌ఫామ్‌లో ఈ క్రేజీ ప్రాజెక్ట్ విశేష ఆదరణ పొందుతోంది. అఖిల భార్గవన్, పార్వతి ఆర్. కృష్ణ, కోట్టాయం నసీర్ తదితరులు కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రం.. వినూత్నమైన కథ, అడుగడుగునా నవ్వించే కామెడీ, ఊహించని సస్పెన్స్ కోరుకునే సినీ ప్రియులకు ఒక పర్ఫెక్ట్ వీకెండ్ వాచ్.

కోమా నుంచి లేస్తే